www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
గురువారం | 1-5-2025 | పేజీలు: 10+8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 15 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: చవితి ఉ.11:24 తదుపరి పంచమి; నక్షత్రం: మృగశిర మ. 2:21 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా.10:18-11:48, దుర్ముహూర్తం: ఉ.10:05-10:56, మ.3:09-4:00, అమృతఘడియలు: ఉ.6:15-7:44, తె 3:36-5:06, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 5:52, సూర్యాస్తమయం: 6:31 | సంగారెడ్డి-మెదక్
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

● రూ.20 వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు

రామచంద్రాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి మెజిస్ట్రేట్ జయంతి 20 ఏళ్ల జైలు, రూ.20 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించినట్టు కొల్లూరు సీఐ రవీందర్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం భోజ్యా నాయక్‌తండాకు చెందిన భానోత్ శ్రీను(22) రెండేళ్ల క్రితం తెల్లాపూర్‌కు చెందిన ఓ విల్లాల్లో డ్యాన్స్ మాస్టర్‌గా చేరాడు. ఈ గ్రూపులోని ఓ ఐదేళ్ల బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడు. ఈ విషయమై అప్పట్లో బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు సీఐ సంజయ్ కేసు నమోదు చేశారు. తర్వాత కేసు దర్యాప్తు చేసిన సీఐ కే.రవీందర్ నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూరారెడ్డి వాదించగా, ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి మెజిస్ట్రేట్ జయంతి 20 ఏళ్ల జైలు, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. నిందితుడిని పట్టుకోవడంలో ఏఎస్ఐ రవీందర్‌రెడ్డి, పీసీలు శ్రీకాంత్, సుభాష్, నర్సింహులు కీలకపాత్ర పోషించారు.



అక్షయ తృతీయ సందడి



అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం సంగారెడ్డిలోని పలు బంగారు ఆభరణాలు విక్రయించే దుకాణాలు జనాలతో రద్దీగా కనిపించాయి. అక్షయ తృతీయ రోజు కొంతైనా బంగారం కొనుగోలు చేస్తే శుభం జరుగుతుందనే నమ్మకంతో తులం ధర లక్షకు చేరువైనా కొనుగోలు చేసేందుకు పలువురు ఆసక్తి చూపారు.

- సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి)

బసవేశ్వర జయంతి వేడుకల్లో పాల్గొన్న నిర్మలాజగ్గారెడ్డి

అందరూ బసవేశ్వరుని అడుగుజాడల్లో నడవాలి

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



సంగారెడ్డిలో బసవేశ్వర చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం సంగారెడ్డిలో బసవేశ్వర జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి బైపాస్‌లోని బసవేశ్వరుని విగ్రహంతో పాటు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బసవేశ్వరుని అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. బసవేశ్వరుడు చేసిన సంస్కరణలు నేటి తరం జనానికి, ప్రభుత్వాలకు ఆదర్శనీయంగా చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకుడు కిరణ్ గౌడ్, వీరశైవ లింగాయత్ ప్రతినిధులు నాయకోటి నవీన్, శివరాజ్, మల్లికార్జున, సంగమేశ్వర తదితరులు పాల్గొన్నారు.



బసవేశ్వర విగ్రహం వద్ద నిర్మలా జగ్గారెడ్డి, వీరశైవ లింగాయత్ ప్రతినిధులు

అద్వితీయం

పదో తరగతి ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. మెదక్ జిల్లాకు 12వ స్థానం లభించింది. బుధవారం వెలువడిన ఫలితాల్లో సంగారెడ్డి జిల్లాలో 99.09 శాతం, మెదక్ జిల్లాలో 96.87 ఉత్తీర్ణత శాతం నమోదైంది. సంగారెడ్డి జిల్లాలోని టీజీ రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్, ఆశ్రమ పాఠశాలల్లో.. మెదక్ జిల్లాలోని 114 పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణతను సాధించాయి.

పదో తరగతి ఫలితాల్లో సంగారెడ్డి జిల్లాకు రెండో స్థానం

12వ స్థానంలో నిలిచిన మెదక్ జిల్లా

గతేడాదితో పోల్చితే మెరుగైన ఫలితాలు

రెండు జిల్లాల్లోనూ బాలికలదే పైచేయి



సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు మిఠాయిలు తినిపిస్తున్న డైరెక్టర్లు

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : మార్చి 21వ నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పరీక్షలను నిర్వహించగా బుధవారం ఫలితాలు విడుదలయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో 22,374 మంది పరీక్షకు హాజరుకాగా 22,170 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో బాలురు 98.93 శాతం ఉత్తీర్ణత, బాలికలు 99.26 శాతం ఉత్తీర్ణులయ్యారు. మెదక్ జిల్లాలో 10,370 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 10,045 మంది పాస్ అయ్యారు. అందులో బాలురు 95.94 శాతం, బాలికలు 97.7 శాతం ఉత్తీర్ణులయ్యారు. రెండు జిల్లాల్లోనూ ఉత్తీర్ణతలో బాలికలదే పైచేయి సాధించారు. మెదక్ జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలోని 225 పాఠశాలుండగా.. 114 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

సర్వత్రా హర్షం

పదో తరగతి ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా రెండో స్థానంలో నిలవడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. 2021-2022, 2022-23 ఏడాది రెండు పర్యాయాల్లో జిల్లా మూడో స్థానంలో నిలవగా, గతేడాది 2023-24లో మరో రెండు స్థానాలు దిగజారి ఐదో స్థానానికి పడిపోయి కొంత నిరాశకు గురిచేసింది. అయితే, ఈసారి అంచనాలకు మించి ఫలితాల్లో జిల్లా ద్వితీయ స్థానంలో నిలవడం గమనార్హం. ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు ప్రతీ ఉన్నత పాఠశాలకు ఓ అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించి వారానికి రెండుసార్లు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించడంతో మంచి ఫలితాలు వచ్చాయనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఇక మెదక్ జిల్లా గతేడాది 18వ స్థానంలో ఉండగా ఈసారి 12వ స్థానానికి చేరుకుని మెరుగైన ఫలితాలను సాధించడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారులు సంతృప్తిని వ్యక్తం చేశారు. అంతేకాకుండా మెదక్ జిల్లాలో 225 పాఠశాలల్లో 114 పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణతను సాధించాయి. వీటిలో జడ్పీహెచ్ఎస్ 60, ప్రైవేటు 28, కేజీబీవీలు 9, బీసీ వెల్ఫేర్ 4, మోడల్ 4, ట్రైబర్ వెల్ఫేర్ 3, సోషల్ వెల్ఫేర్ 3, రెసిడెన్షియల్ 2, మినీ రెసిడెన్షియల్ ఒకటి చొప్పున పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

రీ-కౌంటింగ్, వెరిఫికేషన్‌కు 15 వరకు గడువు

ఇక జూన్ 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్టు ఎస్ఎస్సీ బోర్డు ప్రకటించింది. సప్లిమెంటరీ ఫీజు చెల్లింపునకు ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఇచ్చింది. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈ నెల 15వ తేదీ వరకు అవకాశం కల్పించింది. రీకౌంటింగ్ కోరే విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.500 చొప్పున, రీ వెరిఫికేషన్‌కు సబ్జెక్టుకు రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది.

టెన్త్ ఫలితాల్లో సర్కార్ సత్తా 3

కుక్కల దాడిలో మూడేళ్ల చిన్నారికి గాయాలు

● సంగారెడ్డి ఆసుపత్రికి తరలింపు



గాయపడిన ఫాతీయ

అల్లాదుర్గం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : చిన్నారిపై కుక్కలు మూకుమ్మడిగా దాడి చేయడంతో ఓ చిన్నారికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం రాత్రి అల్లాదుర్గం మండల పరిధిలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. అల్లాదుర్గంనకు చెందిన మస్తాన్ ఖేరేషి కుమార్తె ఫాతీయ(3) ఇంటి ఎదురుగా ఆడుకుంటున్న తరుణంలో అక్కడికి గుంపులు, గుంపులుగా వచ్చిన కుక్కలు ఒక్కసారిగా చిన్నారిపై దాడి చేయడంతో అక్కడున్న కుటుంబీకులు, కాలనీవాసులు అరుస్తూ, కుక్కలను తరమివేశారు. అప్పటికే ఆ చిన్నారి తలపై, ఒంటిపై తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఫాతిమాను హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ ఆసుపత్రి మూసివేసి ఉండటంతో జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు.

వేసవి క్రీడా శిబిరాలకు వేళాయే

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి నెల రోజుల పాటు వేసవి క్రీడా శిబిరాలను నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 10, పట్టణ ప్రాంతాల్లో 12 సమ్మర్ కోచింగ్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భాగంగా సిర్గాపూర్ మండలం అంతర్‌గామ్‌లో ఆత్యాపాత్య, సంగారెడ్డి మండలం గొల్లగూడెంలో బాక్సింగ్, పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో కిక్‌బాక్సింగ్, ఉత్తర్‌పల్లిలో కబడ్డీ, అంగడిపేటలో చెస్, కంది మండలం ఎద్దుమైలారం ఓడీఎఫ్ గ్రౌండ్‌లో అథ్లెటిక్స్, కంది గ్రామంలో అథ్లెటిక్స్, అందోల్ మండలం మాసన్‌పల్లిలో కబడ్డీ, పటాన్‌చెరు మండలం లక్డారంలో బాక్సింగ్, నారాయణఖేడ్ మండలం జుజుల్‌పూర్‌లో ఫుట్‌బాల్ క్యాంపులు నిర్వహించనున్నారు. ఇక పట్టణ ప్రాంతాల్లో వచ్చేసరికి సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో హ్యాండ్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, ఉషు, బీహెచ్‌ఈఎల్ గ్రౌండ్‌లో హాకీ, నారాయణఖేడ్‌లో కబడ్డీ, సదాశివపేటలో ఫుట్‌బాల్, శ్రీవికాస్ హైస్కూల్‌లో కబడ్డీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫుట్‌బాల్, రైఫిల్ షూటింగ్, విగ్నాన్ మోడల్ స్కూల్‌లో వుషు క్రీడా క్యాంపులు నిర్వహిస్తారు. 14 ఏళ్ల లోపు వయసున్న వారు మాత్రమే ఈ శిబిరాల్లో పాల్గొనడానికి అర్హులని, సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల అధికారి ఖాసీంబేగ్ కోరారు. కాగా, బుధవారం ఆయన సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో క్రీడా శిబిరాల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు.



గోరంత అనుమతి.. కొండంత తవ్వకాలు
క్రషర్ బ్లాస్టింగ్‌తో కనిపించని వన్యప్రాణులు
బీడు భూములుగా మారుతున్న పంట పొలాలు
పట్టించుకోని మైనింగ్ అధికార యంత్రాంగం 6

సెంట్రల్ జైల్లో వేలం పాట
హాజరైన జైళ్లశాఖ డీఐజీ శ్రీనివాస్ 6

ఎన్నికలు, ఉద్యోగుల బదిలీతోనే చేయలేకపోయాం

● 'ఆంధ్రజ్యోతి' కథనంతో

వైద్య ఆరోగ్య శాఖ వివరణ

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : 'వైద్య శాఖలో మళ్లీ నోటిఫికేషన్' పేరిట బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ వివరణ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికలు రావడం, తదనంతరం ఉద్యోగుల బదిలీలు చోటుచేసుకోవడం కారణంగా నియామకాలు చేపట్టలేదని తెలిపారు. ఇదిలా ఉంటే సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో 97 పోస్టుల భర్తీకి 2024 ఫిబ్రవరి 27న నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే మార్చి 16 నుంచి జూన్ 6 వరకు పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా, జూలై 5 నుంచి 20 వరకు ఉద్యోగులు బదిలీలు జరిగాయి. అంటే ఎన్నికల కోడ్ 83 రోజులు, ఉద్యోగుల బదిలీలు 16 రోజులు మాత్రమే జరిగితే మిగతా రోజులు ఏం చేశారని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలు, ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్స్ వంటి కారణాలు బూచిగా చూపి ఏడాది కాలం పాటు నియామకాలు చేపట్టని వైద్య ఆరోగ్య శాఖ అధికారుల తీరు పట్ల అభ్యర్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా 'వైద్య శాఖలో మళ్లీ నోటిఫికేషన్' పేరిట 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఉద్యోగాలు భర్తీ చేయకపోవడానికి గల కారణాలపై నివేదిక కోరినట్టు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

80 కిలోల ఎండుగంజాయి పట్టివేత



కారుతోపాటు గంజాయిని స్వాధీనంచేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

జహీరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి కర్ణాటకకు అక్రమంగా తీసుకెళ్తున్న 80కిలోల ఎండుగంజాయిని పోలీసులు పట్టుకున్నట్లు చిరాగ్‌పల్లి ఎస్ఐ.రాజేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం జహీరాబాద్ మండలంలోని చిరాగ్‌పల్లి సమీపంలోని మాడ్గి చౌరస్తావద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో చిరాగ్‌పల్లి మీదుగ కర్ణాటకకు వెళ్తున్న ఏపి28-డీఈ3257 నెంబరుగల ఇండికా కారును ఆపి తనిఖీ చేయగా డిక్కిలో 40 ఎండుగంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. అయితే మండలంలోని గోవింద్‌పూర్ గ్రామానికి చెందిన కారుడ్రైవర్ తిరుమలేష్ బగ్దల్‌లో ఉన్న వినోద్‌కు గంజాయిని తీసుకువెళ్తున్నాడు. తిరుమలేష్‌కు సమీప బంధువైన బీదర్‌పట్టణానికి చెందిన గుండప్ప రూ.50వేలు ఇస్తానని చెప్పడంతో అత్యాశకు పోయి కారులో గంజాయిని తీసుకెళ్తూ పోలీసులకు దొరికాడు. దీంతో రూ.20లక్షలు విలువ చేసే 80కిలోల ఎండుగంజాయి ప్యాకెట్లను, కారును స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ.రాజేందర్‌రెడ్డి తెలిపారు

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

వేర్వేరు చోట్ల ఘటనలు

తూప్రాన్/ములుగు/మాసాయిపేట ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు.

తూప్రాన్‌లో

నర్సంపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం మాచిన్ పల్లి గ్రామానికి చెందిన సుంకే బాలకృష్ణ (24) తాపీ మేస్త్రిగా పనిచేసేవాడు. బాలకృష్ణ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా తూప్రాన్ మండలం నర్సంపల్లి శివారులో ఎక్స్‌కావేటర్ ఢీ కొట్టింది.
ఈ ప్రమాదంలో బాలకృష్ణ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. తూప్రాన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ములుగులో



రాజు మృతదేహం

ట్రాక్టర్, మోటార్ సైకిల్ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తూరు గ్రామంలో జరిగింది. ములుగు మండల పరిధిలోని కొక్కొండ గ్రామానికి చెందిన కుమ్మరి రాజు(40) పెయింటింగ్ పని చేసేవాడు. తన వృత్తి నిమిత్తం మోటార్ సైకిల్ పై మేడ్చల్‌కి వెళ్లి వస్తున్నాడు. కొత్తూరు గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ట్రాలీ తన వాహనాన్ని ఢీకొట్టింది. రాజు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. రాజుకి భార్య స్వరూప, కొడుకు కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.

మాసాయిపేటలో



ఖలీల్ భాషా (ఫైల్)

బొమ్మారం చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ గ్రామానికి చెందిన ఖలీల్ భాషా (38) తన మినీ వ్యాన్‌లో ట్రాన్స్ పోర్టు వ్యాపారం చేసేవాడు. బుధవారం బొమ్మారం చౌరస్తా వద్ద రోడ్డు పక్కనే గల డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

చేపలు పడుతున్న ఇద్దరి మధ్య వాగ్వాదం

మనోహరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి పక్కన చెరువులో చేపలు పడుతున్నాడని ఇద్దరి యువకుల మధ్య గొడవ జరిగింది. ఒకరి పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు అయింది. ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలోని చెరువు పక్కన హర్షగౌడ్ అనే వ్యక్తి ఇల్లు కలదు. అదే గ్రామానికి చెందిన కనిగిరి రాజు ఇంటి పక్కనే చేపలు పట్టేవాడు. దీంతో మంగళవారం సాయత్రం హర్షగౌడ్, కనిగిరి రాజు ఇద్దరి మధ్య మాట మాట పెరిగి, కనిగిరి రాజును హర్షగౌడ్ రాయితో కొట్టాడు. దీంతో కనిగిరి రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు హర్షగౌడ్ పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపారు.

నీట మునిగి వ్యక్తి మృతి

పాపన్నపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ నీట మునిగి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సంఘటన బుధవారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల ఆలయ సమీపంలో జరిగింది. సుమారు 55-60 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి ఆలయం ముందు ఉన్న నదీపాయ వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తూ నీట మునిగాడు. అక్కడే ఉన్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికి తీసి పంచనామా నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఆస్పత్రికి పంపించారు. మద్యం మత్తులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తూ నీట మునిగి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. సంబంధీకులు ఉంటే ఎస్సై శ్రీనివాస్ గౌడ్ 8712657920 సంప్రదించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



మృతి చెందిన గేదె

మనూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్ తగిలి పాడి గేదె మృతి చెందింది. ఈ సంఘటన బుధవారం మనూరు మండలం అతిమ్యాల్‌లో జరిగింది. గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి పాడి గేదెను బుధవారం ఉదయం మేత కోసం తీసుకెళ్లగా గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్ తగిలి పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. దాని విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం వారికి ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

మనువాదంపై పోరాటమే మహనీయులకు నివాళి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మనువాదంపై పోరాటమే మహనీయులకు నిజమైన నివాళి అని కుల వివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, బహుజన ప్రజా వాగ్గేయకారుడు ఏపూరి సోమన్న, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్ అన్నారు. మహాత్మా జ్యోతిబాఫూలే, డా. బీఆర్. అంబేద్కర్ జన జాతర సభ సందర్భంగా బుధవారం సంగారెడ్డిలో కేవీపీఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడారు. దేశంలో ఫూలే, అంబేద్కర్ లాంటి మహనీయులను ఒక కులానికి పరిమితం చేయడం ద్వారా వారిని అవమానించడమేనన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రెండు తలల పాములా దేశ ప్రజలపై విషం చిమ్ముతుందన్నారు.


భార్గవి(583) ములుగు గురుకుల పాఠశాల


పరశురాం(582) కంగ్టి ఎస్టీ బాలుర గురుకుల స్కూల్


శ్రీలేఖ(581) బాలికల ఉన్నత పాఠశాల, ఖేడ్


జాదవ్ బబ్లూ(581) గిరిజన గురుకుల పాఠశాల, ఖేడ్


లాస్య(576) మంథనీ పాఠశాల, పెద్దశంకరంపేట


ప్రసాద్ (576) ఐడీఏబొల్లారం ఆదర్శ పాఠశాల


నీతు శ్రీ(576) జడ్పీహెచ్ఎస్ నారాయణఖేడ్


హరీష్ దుబ్బాక మైనార్టీ పాఠశాల


కె. రాజేశ్వరి మడూర్ హైస్కూల్, చిన్నశంకరంపేట


కార్తీక (570) ఐడీఏబొల్లారం ఆదర్శ పాఠశాల

టెన్త్ ఫలితాల్లో సర్కార్ సత్తా

పదోతరగతి ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. ప్రైవేటుకు దీటుగా ఉత్తమ మార్కులు సాధించి ఔరా అనిపించారు. చాలావరకు సర్కార్ బడులు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు.

-న్యూస్ నెట్‌వర్క్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి)


సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

- గుమ్మడిదల మండలంలోని ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కలిపి 97 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంఈవో రాంబాబు తెలిపారు. 270 మంది విద్యార్థులకు 263 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.
- హత్నూర మండలంలో 841 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 840 మంది ఉత్తీర్ణులయ్యారు.
- నారాయణఖేడ్ మండలంలో 941 మందికి 934 మంది ఉత్తీర్ణత సాధించారు.
- వెల్దుర్తి మండలంలో 384 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 379 మంది పాసయ్యారు.
- రామచంద్రాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో 185 మంది విద్యార్థులకు గాను 184 మంది ఉత్తీర్ణత సాధించారు. తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి పాఠశాలలో 37కి 36 మంది, ఘన్‌పూర్‌లో 17కు 15 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.
- చేగుంటలోని బోనాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 18 మందికి 17 మంది, చందాయిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 82 మందికి 79 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.
- నర్సాపూర్ మండలంలో 777 మంది విద్యార్థులకు గాను 720 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో తారాసింగ్ పేర్కొన్నారు.
- మెదక్ మండల వ్యాప్తంగా 1384 మంది పరీక్షలు రాయగా 1350(97.54 శాతం) మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో నీలకంఠం తెలిపారు.
- అల్లాదుర్గం మండలంలోని చిల్వెర్ పాఠశాలలో 98 శాతం, ముస్లాపూర్‌లో 98.2 శాతం, అల్లాదుర్గం బాలికల ఉన్నత పాఠశాలలో 97.8 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో ధనుంజయగౌడ్ తెలిపారు.
- చిలప్‌చెడ్ మండలంలో 263 మంది విద్యార్థులకు 258 మంది ఉత్తీర్ణత సాధించారు.
- చిన్నశంకరంపేట మండల వ్యాప్తంగా 428 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 415 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.
- హవేళిఘణపూర్ మండలంలలో 541 మంది విద్యార్థులకు గాను 506 మంది పాసయ్యారు.
- రామాయంపేట మండలంలో 736 మంది విద్యార్థులు పరీక్షలకు రాయగా, 710 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.
- పాపన్నపేట మండలంలో 515 మంది విద్యార్థులకు గాను 508 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో 104 మంది విద్యార్థులకు 102 మంది విద్యార్థులు (98.07 శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- తొగుట మండలంలో 254 మందికి 241 మంది ఉత్తీర్ణత సాధించారు.
- చిన్నకోడూరు మండలంలో 391 మందికి 367 మంది విద్యార్థులు (93.86 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో యాదవరెడ్డి తెలిపారు.
- నంగునూరు మండలంలో 368 మంది విద్యార్థులు హాజరు కాగా 360 మంది ఉత్తీర్ణులయ్యారు.
- గజ్వేల్ మండల పరిధిలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 83.34 శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు గజ్వేల్ మండల విద్యాధికారి వై. కృష్ణ తెలిపారు.
- కొండపాక మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 397 మంది పరీక్షలు రాయగా, 389 మంది ఉత్తీర్ణత సాధించారు.
- మర్కుక్ మండల పరిధిలోని నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బాలో మొత్తం కలిపి 242 మంది పరీక్షకు హాజరయ్యారని, ఇందులో 199 మంది విద్యార్థులు పాసైనట్లు మండల విద్యాధికారి వెంకట్‌రాములు తెలిపారు.
- బెజ్జంకి మండలంలో 97.71 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 349 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 341 మంది ఉత్తీర్ణత సాధించారు.
- హుస్నాబాద్ మండలంలో 99.03 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.
- శివ్వంపేట మండంలో మొత్తం 514 మందికి 486 మంది ఉత్తీర్ణత సాధించారు.
- సిద్ది జిల్లాలోని 22 కేజీబీవీలకు గానూ 10 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా 94.77 శాతం ఉత్తిర్ణత సాధించారు. పట్టణంలోని తెలంగాణ మైనార్టీ స్కూల్ 44 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 42 మంది పాస్ అయ్యారు. సిద్దిపేట ప్రభుత్వ ఉన్నత నూతన పాఠశాలలో 57 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 53 మంది ఉత్తిర్ణత సాధించారు. ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో మాథ్స్‌లో ముగ్గురు విద్యార్థులు 100 కు వంద మార్కులు సాధించారు.

ఈ మండలాల్లో అందరూ పాస్

వట్‌పల్లి మండలంలో 255 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయగా అందరూ పాసైనట్లు ఎంఈవో గోవింద్ రెడ్డి తెలిపారు. కంగ్టి మండలంలో మొత్తం 350 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా మొత్తం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాధికారి రహీమోద్దిన్ తెలిపారు. అదేవిధంగా కొండాపూర్ మండలంలో 626 మంది విద్యార్థులకు 626 మంది, మద్దూరు మండలంలో 204 మందికి 204 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

వందశాతం ఉత్తీర్ణత శాతం సాధించిన ప్రభుత్వ బడులివే

ఐడీఏబొల్లారంలోని ఆదర్శ పాఠశాల, జిన్నారం ఎస్టీ గురుకుల, తెల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల, నారాయణఖేడ్ మండలంలోని సంజీవన్‌రావుపేట, అబ్బెంద, సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, చాప్టాకె, హన్మంత్‌రావుపేట, అనంత్‌సాగర్, జడ్పీ ఉన్నత, కస్తూర్బా బాలికల విద్యాలయం, మైనార్టీ గురుకుల, జ్యోతిబాపూలే, తెలంగాణ మినీ గురుకుల, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలు వందశాతం సాధించాయి.

నాగల్‌గిద్ద మండల పరిధిలోని మోర్గి మోడల్ కళాశాల, జడ్పీ ఉన్నత, నాగల్‌గిద్ద, కారముంగి, కరసగుత్తి ఉన్నత పాఠశాలు, చేగుంట, వడియారం, మక్కరాజుపేట, ఇబ్రహీంపూర్, రెడ్డిపల్లి, కరీంనగర్ జడ్పీహెచ్ఎస్‌లు, చేగుంట ఆదర్శ, రెడ్డిపల్లి కస్తూర్బా, చేగుంట గిరిజన గురుకుల పాఠశాలలు, రేగోడు కస్తూర్బా బాలికల విద్యాలయం శతశాతం ఫలితాలు సాధించాయి.

అలాగే పెద్దశంకరంపేట మండల పరిధిలోని చీలపల్లి, మూసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ విద్యాలయం మోడల్ స్కూల్ పాఠశాల, అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్, అల్లాదుర్గం జిల్లా పరిషత్(బాలుర) ఉన్నత పాఠశాల, చిలప్‌చెడ్ మండలంలోని చండూరు, చిట్కుల్, గౌతాపూర్, ఫైజాబాద్, చిలప్‌చెడ్ ప్రభుత్వ పాఠశాలలు, చిన్నశంకరంపేట మండలంలోని సూరారం హైస్కూల్, పాపన్నపేట మండలంలో కుర్తివాడ, కేజీబీవీ, యూసఫ్‌పేట, మల్లంపేట, కొడుపాక ప్రభుత్వ పాఠశాలలు, చిన్నకోడూరు మండలంలో 9 ప్రభుత్వ పాఠశాలలు, నంగునూరు మండలంలోని మగ్దుంపూర్, అంక్షాపూర్, రాజగోపాలపేట, నర్మెటలోని కేజీబీవీ, అక్కెనపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.

చేర్యాల మండలంలోని ముస్త్యాల మోడల్ స్కూల్, కస్తూర్బా, అర్జునపట్ల, కడవేరుగు, తాడూరు, వీరన్నపేట, గుర్జకుంట, పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్ బాలుర, పోతిరెడ్డిపల్లి-పెద్దరాజుపేట జడ్పీఎస్ఎస్‌లు, కొండపాక మండలంలోని కొండపాక మర్పడగ, బందారం, అంకిరెడ్డిపల్లి, తిమ్మారెడ్డిపల్లి, ఖమ్మంపల్లి, కొండపాక కేజీబీవీ, కొండపాక మోడల్ స్కూల్, ధూళిమిట్ట, బైరాన్‌పల్లి, కూటిగల్ ఉన్నత పాఠశాలలు, మద్దూరు మండలంలోని కస్తూర్బా పాఠశాల, శివ్వంపేట మండంలోని పాంబండ, పెద్దగొట్టిముక్కుల, రత్నాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు.

సంగారెడ్డి జిల్లా టాపర్‌గా కంకోల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని

● 590 మార్కులు సాధించిన వర్షిక



మునిపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి ఫలితాల్లో సంగారెడ్డి జిల్లా టాపర్‌గా ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సత్తా చాటింది. హైదరాబాద్‌లోని జగద్గిర్‌గుట్టకు చెందిన గడ్డం వసంత- వరప్రసాద్‌ల కూతురు గడ్డం వర్షిక మునిపల్లి మండలం కంకోల్ లో తన మేన మామ వద్ద ఉంటూ స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో చదువుకుంటున్నది. 600 మార్కులకు 590 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలువడంతో ఆమెకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్ర మైనార్టీ గురుకులాల టాపర్‌గా రిషిత



జోగిపేట, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): అందోలు మైనార్టీ గురుకుల విద్యార్థిని మంగలి రిషిత పదో తరగతి పరీక్షల్లో సత్తా చాటింది. 600 మార్కులకు గానూ 586 మార్కులు సాధించి రాష్ట్రంలోని మైనార్టీ గురుకులాల్లోనే టాపర్‌గా నిలిచింది. రిషితను ఎంఈవో బండి క్రిష్ణ, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ అభినందించారు.


ఐరన్ స్ర్కాప్ వేలం నిర్వహిస్తున్న జైళ్లశాఖ డీఐజీ శ్రీనివాస్

సెంట్రల్ జైల్లో ఐరన్ స్ర్కాప్ వేలం

● హాజరైన జైళ్లశాఖ డీఐజీ శ్రీనివాస్

కంది, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి సెంట్రల్ జైల్లో జైళ్లశాఖ డీఐజీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఐరన్ స్ర్కాప్‌కు వేలంపాట నిర్వహించారు. జైల్లోని స్టీల్ ఫ్యాక్టరీలో ఐరన్ స్ర్కాప్ 5.6 టన్నులు, 50 కిలోల ప్లాస్టిక్ స్ర్కాప్ ఉంది. జిల్లా నలుమూలల నుంచి స్ర్కాప్‌ను కొనే 70 మంది వ్యాపారస్థులు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. అందులో నుంచి ఎం.డి. అబ్దుల్ హనీఫ్ అనే వర్తకుడు దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా జైళ్లశాఖ డీఐజీ శ్రీనివాస్ మాట్లాడతూ, ఈ ఐరన్, ప్లాస్టిక్ స్ర్కాప్ ద్వారా వచ్చిన ఆదాయన్ని జైళ్లశాఖ సంస్కరణలకు ఉపయోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జైలు పర్యవేక్షణ అధికారి సంతోష్ కుమార్ రాయ్, జైలర్లు, డిప్యూటీ జైలర్లు, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో గురుకుల విద్యార్థిని సత్తా



మునిపల్లి, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లాలోని మందమర్రి సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన 54వ రాష్ట్ర సీనియర్ మహిళల హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో మునిపల్లి మండలం బుదేరా చౌరస్తాలో గల గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని బి. కల్పన ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకొని సత్తా చాటారు. ఈ సందర్భంగా కల్పనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి, అధ్యాపక బృందం అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

అర్హత మేరకే నియామకాలు చేపట్టాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మెడికల్ కళాశాలలో సిబ్బందిని అర్హత మేరకే నియామకాలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు ఏజెన్సీకి అప్పటించి వారి ఇష్టానుసారం కళాశాల, ఆసుపత్రి సిబ్బందిని నియమించడం సరైంది కాదన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని అర్హత గలవారిని మాత్రమే నియమించేలా చూడాలన్నారు. అదేవిధంగా మేడే సందర్భంగా గురువారం నిర్వహించే ప్రదర్శనలో అన్ని వర్గాల కార్మికులు భారీగా తరలివచ్చి మేడేను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాణిక్యం, నర్సింలు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే . ధాన్యం విక్రయించాలి



మెదక్/నర్సాపూర్/అల్లాదుర్గం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి తెలిపారు. మండలంలోని ముత్తాయికోట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తసీల్దార్ సింధురేణుక, నిర్వాహకులు పాల్గొన్నారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి సమీపంలోని వెంకటేశ్వర మిల్లును ఆర్డీవో మహిపాల్ తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి సందర్శించి, మిల్లర్లకు పలు సూచనలు చేశారు. అలాగే నర్సాపూర్ మండలంలోని బ్రాహ్మణపల్లి, తుజాల్‌పూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌రావు పరిశీలించారు. అల్లాదుర్గం మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ మల్లయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి, నాయకులు సుభాష్‌రావు దేశ్‌పాండే, కొంక శ్రీశైలంతో కలిసి ప్రారంభించారు.

జేఎన్టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె విరమణ


అసిస్టెంట్ ప్రొఫెసర్లతో సమ్మెను విరమింపజేస్తున్న ప్రిన్సిపాల్ నరసింహ

పుల్‌కల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సమ్మెను బుధవారం విరమింపజేశారు. గడిచిన 24 రోజులుగా వివిధ రూపాల్లో శాంతియుతంగా ఆందోళన చేస్తూ.. 12 రోజులుగా నిరవధిక సమ్మెకు దిగారు. అయితే, రెండు, మూడు రోజులుగా ప్రభుత్వంలోని పెద్దలు, ఇతర అధికారులతో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సంప్రదింపులు జరిపారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలు వివరించి వాటి పరిష్కారానికి హామీ తీసుకుంటామని చెప్పడంతో నిరవధిక సమ్మెను విరమింపజేశారు. ఇందులో భాగంగానే సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ కళాశాల ప్రధాన గేటు పక్కన గల సమ్మె శిబిరం వద్దకు ప్రిన్సిపాల్ జి.నరసింహ, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావులు చేరుకుని వారికి తేనీరు అందజేసి సమ్మెను విరమింపజేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల డిమాండ్ల పరిష్కారం పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, త్వరలోనే సమస్యలు ఒక కొలిక్కి వస్తాయని ప్రిన్సిపాల్ నరసింహ తెలిపారు. కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ రాష్ట్ర కో ఆర్డినేట్ కమిటీ సూచనల మేరకు సమ్మెను విరమింపజేస్తున్నట్లు ప్రకటించారు.

తొలిప్రయత్నంలోనే జడ్జిగా సాహితి


తల్లిదండ్రులతో మల్యాల సాహితి

నంగునూరు, ఏప్రిల్ 30 : సిద్దిపేట జిల్లా నంగునూరుకు చెందిన మల్యాల అన్నపూర్ణ, రాజు దంపతుల పెద్దకూతురు మల్యాల సాహితి మొదటి ప్రయత్నంలోనే జడ్జిగా ఎంపికైంది. సాహితీ ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకు సిద్దిపేట గౌతమ్ మోడల్ స్కూల్‌లో విద్యను అభ్యసించింది. హైదరాబాదులోని ఎన్టీఆర్ జూనియర్ కాలేజీలో ఇంటర్ పూర్తి చేసి, బీ బీ ఏఎల్ ఎల్ బి బెంగుళూరులోని రేవా యూనివర్సిటీలో లా విద్య పూర్తి చేసింది. ఆరు నెలల క్రితం హైకోర్టు ఇచ్చిన నోటిఫికేషన్ లో సాహితి దరఖాస్తు చేసుకుని జడ్జి పోస్ట్ కోసం రాత పరీక్షలకు హాజరైంది. రెండు రోజుల క్రితం జరిగిన ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయి నేరుగా జడ్జిగా ఎంపికైంది. సాహితి ఎంపిక పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతానికి చెందిన సాహితి జడ్జిగా ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.



గోరంత అనుమతి.. కొండంత తవ్వకాలు

క్రషర్ బ్లాస్టింగ్‌లతో కనిపించని వన్యప్రాణులు

- బీడు భూములుగా పంట పొలాలు
- రాంపూర్‌లో ఇళ్లకు పగుళ్లు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

కొల్చారం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామంలో 2018లో జాతీయ రహదారి నిర్మాణం కోసం క్రషర్‌ను ఏర్పాటు చేశారు. దానికి సంబంధించి ప్రభుత్వ భూమి 373 సర్వే నెంబర్‌లో ఎస్ఎల్ఎమ్ఐ కంపెనీకి మూడు హెక్టార్లు అనుమతి ఇచ్చారు. కానీ దానికి మించి కంకరను తవ్వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అటవీ ప్రాంతానికి అనుకొని తవ్వకాలు జరపడంతో జంతువులు వేరే ప్రాంతాలకు తరలి వెళ్లిపోతున్నాయని వాపోతున్నారు. అంతేకాకుండా అక్రమ తవ్వకాలతో ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చని పంట పొలాలు నాశనమవుతున్నాయి. ముఖ్యంగా క్రషర్ల బ్లాస్టింగ్‌లతో గ్రామంలోని ఇళ్లు పగుళ్లు ఏర్పడి శిథిలావస్థకు చేరుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుట్టను తవ్వినా అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ పనుల పేరిట ప్రైవేటుకు అమ్మకాలు జరుపుతున్నారు. లారీలకు ఎలాంటి వే బిల్లులు లేకుండానే అమ్మకాలు జరగడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు హెక్టార్లు అని చెప్పి 12 హెక్టార్ల ప్రభుత్వ భూములను వాడుకుంటున్నారు. ఈ విషయమై మైనింగ్ అధికారిని వివరణ కోరగా అనుమతి ఇచ్చిన దానికంటే ఎక్కువగా తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి



గ్రామంలో సన్నకారు రైతులం ఉన్నాం. ఈ బ్లాస్టింగ్ వల్ల బోర్లు, మోటర్లు కిందికి పడిపోవడంతో ఎంతో నష్టపోతున్నాం. పంట పొలాలపై దుమ్ము, ధూళి రావడంతో దిగుబడి తక్కువ వస్తుంది. గతంలో ఎన్నో మార్లు విన్నవించినా ఎస్ఎల్ఎమ్ఐ కంపెనీ యజమాని పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అరికట్టాలి.

-రైతు యాదగిరి


తవ్విన గుట్ట


ఇంటి స్లాబ్‌కు పగుళ్లు

'వాసవీ మా ఇల్లు' సేవలు ఆదర్శనీయం: నిర్మలాజగ్గారెడ్డి





వాసవీ మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మంజీరా తాగునీటి సరఫరా ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న నిర్మలాజగ్గారెడ్డి, అలాగే సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో జార్జ్‌కు తాగునీటిని అందజేస్తున్న నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో వాసవీ మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని టీజీఐ ఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డిలోని ఆయా ప్రాంతాల్లో వాసవీ మా ఇల్లు ఆధ్వర్యంలో బుధ వారం ఏర్పాటు చేసిన చలివేంద్రం శిబిరాలతో పాటు ఉచిత మంజీరా తాగునీటి సరఫరా ట్యాంక్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. కొన్నేళ్లుగా వాసవీ మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు తోపాజీ అనంత కిషన్ నేతృత్వంలో అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతు న్నారని అభినందించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో, పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద, ఐబీ గెస్ట్‌హౌస్ ఆవరణలో, బైపాస్ లోని సాయిబాబా కమాన్, కలెక్టరేట్ వద్ద తదితర ప్రాంతాల్లో చలివేంద్రాలను తోపాజీ అనంత కిషన్‌తో కలిసి నిర్మలాజగ్గారెడ్డి ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో తోపాజీ అనంత కిషన్, కాంగ్రెస్ నాయకులు జార్జ్ మాథ్యూస్, గంగేరి శ్రీహరి, తోపాజీ హరికిషన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో పనులు పూర్తి



ఖేడ్‌లో ముత్తడి పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : అందరి సహకారంతో ఆలయ నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. బుధవారం ఖేడ్ పట్టణంలోని సాయిబాబా కాలనీలో బసవ జయంతి, అక్షయ తృతీయను పురస్కరించుకొని ముత్తడి పోచమ్మ ఆలయ పునర్నిర్మాణం కోసం బుధవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూ ప్ షెట్కార్, మాజీ కౌన్సిలర్ హన్మాండ్లు, అర్చకులు మోహన్ జ్యోషి, కాలనీ పెద్దలు పాల్గొన్నారు. అలాగే ఖేడ్‌లో క్షయవ్యాధి నివారణకు సంబంధించిన సమాచారంతో కూడిన కరపత్రాలను జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ అరుణతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పొగాకు నియంత్రణ జిల్లా పర్యవేక్షకులు విష్ణువర్ధన్‌రె డ్డి, నాయకులు వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు కృషి

నారాయణఖేడ్, ఏప్రిల్ 30 (ఆంధ్ర జ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీ యడానికి కృషి చేస్తానని ఇంపాక్ట్ ట్రైనర్ కుమ్మరి నర్సింలు తెలిపారు. ఇంపాక్ట్ క్లబ్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు గంపా నాగే శ్వర్‌రావు పర్యవేక్షణలో, జాతీయ ఉపాధ్య క్షుడు డాక్టర్ ఆదినారాయణరెడ్డి ఆధ్వ ర్యంలో ట్రైన్ ది ట్రైనర్ వర్క్‌షాప్-187 బ్యాచ్‌లో విజయవంతంగా శిక్షణ ముగించు కొని, అటెండెన్స్, అసైన్మెంట్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో గంపా నాగేశ్వర్‌రావు చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుని మాట్లాడారు. ఈ శిక్షణ ద్వారా ఎన్నో విషయాలను నేర్చుకున్నానని తెలిపారు.

అమరవీరులకు నివాళులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 30 ఆంధ్రజ్యోతి): ఖేడ్‌లో ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో బుధ వారం అమరవీరుల సంస్మరణ వారోత్స వాల్లో భాగంగా అమరవీరుల చిత్రపటా లకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తుకారంనాయక్ మాట్లాడుతూ అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించి ప్రజావ్యతిరేక విధానాలపై పోరా టాలు చేయాలన్నారు.

పోరాట ఫలితమే అంగన్‌వాడీలకు సెలవులు

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్ర జ్యోతి) : సీఐటీయూ పోరాట ఫలితమే రాష్ట్ర ప్రభుత్వం నేడు అంగన్‌వాడీ కేంద్రా లకు మే నెలంతా సెలవులు ప్రకటించిం దని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు బుధవారం తెలిపారు. విద్యా సంస్థలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తం చేశామన్నారు. సీఐటీయూ పోరాట ఫలితం గానే నెలంతా అంగన్‌వాడీ కేంద్రాలకు సెల వులు ఇచ్చారని ఆయన అన్నారు. ఇదే స్ఫూర్తితో పెండింగ్ సమస్యలను కూడా సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న గ్రామదేవతల జాతర

కొండాపూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలు గ్రామాలలో గ్రామ దేవతల జాతరలు మొదలు కాగా బ్రహ్మో త్సవాలకు ఆలయాలు సిద్ధమవుతున్నాయి. బుధవారం శివన్నగూడెంలో మల్లన్న, బీర ప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, మునిదేవు నిపల్లిలో ఎల్లమ్మతల్లి ఆలయ వార్షికోత్స వాలు కొనసాగాయి. ఈ సందర్భంగా సుప్ర భాత ఆవాహిత దేవతాపూజ, హోమాలు, యంత్ర, విగ్రహ, ప్రాణ ప్రతిష్ఠలు నిర్వ హించారు. కాగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనను రెండురోజుల పాటు నిర్వహి స్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

భూ నిర్వాసితులకు చెక్కుల పంపిణీ

నర్సాపూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి కెనాల్ కోసం భూములు కోల్పో తున్న మండలంలోని రెడ్డిపల్లి, బ్రాహ్మణ పల్లి రైతులకు పరిహారం కింద వచ్చిన చెక్కులను గ్రామాలకు వెళ్లి అందజేస్తు న్నట్లు తహసీల్దార్ కే.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ రెడ్డిపల్లిలో 15 మంది రైతుల నుంచి 11.32 ఎకరాలకు రూ.కోటి 86 లక్షల 64 వేల 963, బ్రాహ్మణపల్లికి చెందిన 82 మంది రైతుల నుంచి 33.04 ఎకరాలకు గాను రూ.4 కోట్ల 99 లక్షల 69 వేల 676 పరిహారం కింద చెక్కుల రూపంలో వచ్చా యని, వాటిని సంబంధిత రైతులకు రెవెన్యూ సిబ్బంది ఆయా గ్రామాలకు వెళ్లి పంచాయతీ కార్యాలయంలో రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు.

ఖేడ్ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా జి.నారాయణ



నారాయణఖేడ్, ఏప్రిల్ 30 (ఆంధ్ర జ్యోతి) : ఖేడ్ పట్టణ శివార్లలోని మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిప ల్‌గా డాక్టర్ జి.నారా యణ బుధవారం బాధ్యతలను స్వీకరిం చారు. కళాశాలలో అర్థశాస్త్రం అధ్యాపకు లుగా పనిచేస్తున్న నారాయణను రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా నియమిస్తూ ఉన్నత విద్యా శాఖ కమిషనర్ దేవసేన ఆదేశాలు జారీచేయగా... బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అధ్యాపకులు, సి బ్బంది ఆయనను అభినందించారు.

పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు

అల్లాదుర్గం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న పలు పథకాలు పార్టీల కతీతంగా అర్హత కలిగినవారు సద్విని యోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండలా ధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి, నాయకులు సుభాష్‌రావుదేశ్‌పాండే తెలిపారు. బుధ వారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ ఎఫ్ చెక్కులను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బాలకిషన్, నర్సింలు, జైపాల్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో త్వరలో రెవెన్యూ సదస్సులు: కలెక్టర్



జిన్నారంలో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

జిన్నారం/గుమ్మడిదల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలపై త్వరలో రెవెన్యూ సభలు నిర్వ హిస్తామని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధ వారం జిన్నారం రైతువేదికలో భూభారతి అవగా హన సదస్సును ఆమె ప్రారంభించి మాట్లాడారు. భూ హక్కుల రికార్డుల్లో పొరపాట్లు ఉంటే వాటిని సవరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌వోఆర్ చట్టం 2025 ద్వారా అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్ర సాద్, ఆత్మ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రైతులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే జిన్నారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సంద ర్శించి, ధాన్యం సేకరణ, తేమ శాతం రికార్డుల నమోదు పరిశీలించారు. కొనుగోళ్ల విషయంలో రైతు లను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవన్నారు. నిర్ణీత గడువులోపు భూ సమస్యల పరిష్కారానికి భూభా రతి చట్టం దోహదపడుతుందని కలెక్టర్ క్రాంతి వల్లూరు క్రాంతి సూచించారు. గుమ్మడిదల మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, పటాన్‌చెరు నియోజకవర్గం ప్రత్యేకాధికారి దేవుజా, ఆర్డీవో రవీం దర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గుమ్మడిదలలోని 109 సర్వే నెంబర్లలో ఐటీ ఇండస్ట్రీ యల్ పార్కు నిర్మాణం కోసం ప్రభుత్వం రైతుల నుంచి భూమి తీసుకున్నదని, దానికి సంబంధించి నష్ట పరిహారం ఇవ్వాలని బీఆర్ఎస్ నేత చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి రైతులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

సమాజంలో అసమానతలు ఉండొద్దు



అల్లాదుర్గంలో పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతులు

అల్లాదుర్గం/పెద్దశంకరంపేట/నారాయణఖేడ్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : హిందూ సమాజంలో సాంఘిక అసమాన తలు ఉండొద్దని పీఠాధిపతులు శంకర్‌స్వామి, శాంతానంద, దేవగిరిమహరాజ్ అన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వ ర్యంలో నిర్వహించే సామాజిక అల్లాదుర్గం చేరుకున్నది. వివిధ పీఠాధిపతులు దళితవాడలలో పర్యటించి పూజలు నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ పాటు పడాలని సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్ అన్నారు. పెద్దశంకరం పేటలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సామాజిక సమర సతలో భాగంగా తిరుమలాపూర్ ఆంజనేయస్వామి ఆలయం నుంచి పురవీధుల గుండా స్వామీజీలతో శోభాయాత్ర నిర్వ హించారు. నారాయణఖేడ్‌లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వ ర్యంలో సామాజిక సమరసత శోభాయాత్ర నిర్వహించారు.

అందరి మన్ననలు అందుకున్న వ్యక్తి రాంరెడ్డి

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్



రాంరెడ్డిని సత్కరిస్తున్న డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్

నర్సాపూర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహ ణలో అందరి మన్ననలు పొందిన వ్యక్తి నర్సాపూర్ ఇన్ చార్జి ఎక్సైజ్ సీఐ భీంరెడ్డి రాంరెడ్డి అని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ పేర్కొ న్నారు. రాంరెడ్డి ఉద్యోగ విర మణ సందర్భంగా ఆయనకు వీడ్కోలు సమావేశం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి హరికి షన్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీని వాస్‌రెడ్డి హాజరై రాంరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హరికిషన్ మాట్లాడుతూ రాంరెడ్డి ఎక్సైజ్ శాఖలో వివిధ హోదాల్లో చేసిన సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి నర్సాపూర్ ఎక్సైజ్ సీఐ గోపాల్, ఎక్సైజ్ ఎస్‌ఐలు అజిల్, రాజేందర్, అరు ణతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి సహకారంతో ప్రభుత్వ కార్యాలయాలు

● కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నత్తి దశరత్

పుల్‌కల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండల ప్రభుత్వ కార్యాలయాలు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, శాస్త్ర సాంకేతికశాఖ మంత్రి దామో దర్ రాజనరసింహ అండదండలతో చకచక ఏర్పాటవుతున్నాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్ అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెండికోలు రాములు, కలాలి ఈశ్వర్‌గౌడ్‌తో కలిసి బుధవారం తాడ్దానిపల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా అవసరాలకనుగుణంగా మండలంలోని గ్రామాలకు మధ్యలో ఉన్న సుల్తాన్‌పూర్ పీహెచ్‌సీ, పోలీస్‌స్టేషన్, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. తాజాగా సుల్తాన్‌పూర్‌లో పీహెచ్‌సీ భవనం నిర్మించేందుకు రూ.2.6 కోట్ల నిధులు మంజూరు చేయించడమే కాకుండా పరిపాలన అనుమతులు కూడా మంజూరయ్యాయన్నారు. ఈ సమావేశంలో నాయకులు గోవర్ధన్‌ముదిరా జ్, శ్రీనివాస్‌రెడ్డి, దేవయ్య, రమేశ్, వెంకటరెడ్డి, మహేశ్, వసంత్‌గౌడ్, సార సంజయ్, సత్యారెడ్డి, అశోక్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రాబోయే తరాలకు స్ఫూర్తి బసవేశ్వరుడు



సంగారెడ్డిలో బసవేశ్వరుడికి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చింతా



రామచంద్రాపురం బీరంగూడ కమాన్ వద్ద బసవేశ్వరుడి విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



జహీరాబాద్ : బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేష్

రాబోయే తరాలకు స్ఫూర్తి బసవేశ్వరుడని పలువురు నాయకులు పేర్కొన్నారు. మహాత్మా బసవేశ్వరుడి జయంతిని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో బుధవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

\- న్యూస్ నెట్‌వర్క్



జోగిపేటలో బసవేశ్వరుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్, మాజీ జడ్పీ చైర్మన్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్



మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లిలో బసవేశ్వర విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న శశికుమార్, తదితరులు

'పది' ఫలితాల్లో 'ప్రైవేటు' విజయభేరి

● టెన్త్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు



సంగారెడ్డి అర్బన్ : ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ ఆంథోనీరెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి ఫలితాల్లో సంగారెడ్డిలోని పలు ప్రైవేటు పాఠశా లల విద్యార్థులు సత్తాచాటారు. సంగారెడ్డి శాంతినగర్ లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌కు చెందిన విద్యా ర్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి విజయకేతనం ఎగురవేశారు. 40 మంది 95 శాతంపైగా ఉత్తీర్ణత, 118 మంది 90 శాతంపైగా ఉత్తీర్ణత, 236 మంది 80 శాతం పైగా, 253 మంది 75 శాతంపైగా ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను విద్యాసం స్థల అధినేత సోలోమోన్‌రెడ్డి, డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ హెడ్ జయబాలరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ అరుణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్ లక్కీశెట్టి అభినందించారు.

రిషి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

సంగారెడ్డి బాలాజీ నగర్‌లోని రిషి హైస్కూల్ విద్యా ర్థులు పదవతరగతి ఫలితాల్లో 79 మందికి 79 మంది ఉత్తీర్ణత సాధించి విజయఢంకా మోగించారు. ఎల్.హం సిని (574/600), కనిష్క (574/600), శ్రావణి 568, హర్షిత 567, మేఘన 561, పవన్ 558, మైత్రి 557, శ్రీవిద్య 554, జుబియా 553, అశ్వాక్ 553, సాయిశ్రీజ 550, శషాంత్ 550 మార్కులు సాధించగా, 500 మార్కులకుపైగా 39 మంది సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల పిన్సి పాల్, కరస్పాండెంట్ పి.లక్ష్మిరెడ్డి అభినందించారు.

శ్రీసాయి కృష్ణ హైస్కూల్ సత్తా



ప్యాట కీర్తన, కాటారం కీర్తన, శివకుమార్

సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి విద్యానగర్‌లోని శ్రీసాయి కృష్ణ హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్యాట కీర్తన (574/600), కాటారం కీర్తన 563, శివకుమార్ 558 మార్కులు సాధించారు. విద్యార్థులను సాధించిన ప్రిన్సిపాల్ డి.రామారావు, వైస్ ప్రిన్సిపాల్ భాష్యం శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.

ఫలితాల్లో సెయింట్ ఆన్స్ అగ్రగామి

సంగారెడ్డి కొత్త బస్టాండ్ సమీపంలోని సెయింట్ ఆన్స్ హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో అగ్రస్థానంలో నిలిచారు. పాఠశాలకు చెందిన తాళ్ల సాహిత్య (589/600) మార్కులు సాధించి పట్టణంలో అగ్రగామిగా నిలిచారు. 49 మంది విద్యార్థులు 500 మార్కులకుపైగా సాధించారు. విద్యార్థులను పాఠ శాల కరస్పాండెంట్ కె.ఆంథోనీరెడ్డి అభినందించారు.

సెయింట్ ఆంథోనీస్ విజయకేతనం

సంగారెడ్డి విద్యానగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో విజ యకేతనం ఎగురవేశారు. పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. 600 మార్కులకుగాను ఒకరికి 590 మార్కులు, 154 మంది 500 మార్కులకుపైగా మార్కులు సాధించారు. వీరిని పాఠశాల చైర్మన్ ఇ.ఆం థోనీరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రవీల అభినందించారు.

పది ఫలితాల్లో గీతా విద్యార్థుల ప్రభంజనం

మెదక్ అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పదో తర గతి ఫలితాల్లో మెదక్, మంబోజిపల్లి, నర్సాపూర్ గీతా విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. బుధవారం వెలువడిన ఫలితాల్లో స్వాతిక్‌గౌడ్ (585/600), వినీల 584, సంజన 581, సుమంత్ 581 మార్కులతో విజయకేతనం ఎగురవేశారు. నలుగురు విద్యార్థులు 580, 42 మంది 550 మార్కులు సాధిం చారు. తెలుగు 99, హిందీ 99, ఇంగ్లీష్ 100, సైన్స్ 100, సోషల్ 99 మార్కులు సాధించి మెదక్ జిల్లాలోనే అగ్ర స్థానంలో నిలిచారు. ఉత్తమ ఫలితాలు సాధించి విద్యా ర్థులను పాఠశాల సెక్రటరీ రామాంజనేయులు, ప్రిన్సి పల్ మాధవి అభినందించారు.



సంగారెడ్డి అర్బన్ : ఉత్తమ ఫలితాలు సాధించిన రిషిహైస్కూల్ విద్యార్థులు



మెదక్ అర్బన్: గీతా విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల సెక్రెటరీ రామాంజనేయులు, ప్రిన్సిపాల్ మాధవి



మెదక్ అర్బన్ : సిద్దార్థ్ విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్‌చౌదరి, ప్రిన్సిపాల్ సంధ్యారాణి

సిద్ధార్థ్ విద్యార్థుల విజయభేరి

పది ఫలితాల్లో మెదక్ సిద్ధార్థ్ మోడల్ స్కూల్ విద్యా ర్థులు ఉత్తమ ఫలితాలు సాధించి విజయభేరి మోగిం చారు. దీపక్‌గౌడ (582/600) మనోహరి 581, ఫాతిమా 581, బబిత 580 మార్కులు సాధించారు. 70 మంది విద్యార్థులు 550 మార్కులు, 178 మంది 500పైగా మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి, ప్రిన్సిపల్ సంధ్యారాణి అభినందించారు.

తూప్రాన్‌లోని గీతా స్కూల్ ప్రభంజనం



పి.నిశాంత్, చక్రవర్ధన్‌రెడ్డి

తూప్రాన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : పదో తర గతి పరీక్షా ఫలితాల్లో తూప్రాన్‌లోని గీతా పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పి.నిశాంత్ (588/600), చక్రవర్ధన్‌రెడ్డి 585 మార్కులతో రాష్ట్రస్థా యిలో సత్తాచాటారు. మరో 28 మంది విద్యార్థులు 550కి పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయులు, చైర్‌ప ర్సన్ ఉష, డైరెక్టర్లు రామచేందర్‌గౌడ్, నారాయణగుప్తా, ప్రిన్సిపాల్ వెంకట కృష్ణారావు, ఏఓ ప్రిన్సిపాల్ ప్రేమ్‌రాజ్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

నల్లపోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా మల్లన్న

మనూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన బోరంచ నల్లపోచమ్మ దేవాలయ శాఖ కమిటీని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ రెడ్డి, దేవాదాయశాఖ ఈవో శివరుద్రప్ప, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ విజయ లక్ష్మి, పెద్దల సమక్షంలో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బెల్లా పురం మల్లన్న, ఆలయ ప్రధాన అర్చకులుగా శ్రీకాంత్‌స్వామి, సభ్యులుగా చెట్టుకింది సిద్ధప్ప, పోతన్‌పల్లి పెంటన్న, దండు సిద్ధప్పలను ఎన్నుకు న్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకోబ డిన కమిటీ చైర్మన్, సభ్యులు దేవాదాయ అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోజిరెడ్డి, న్యాయవాది సంగన్న, దిగంబర్‌రావు పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాగా నేటి నుంచి నల్లపోచమ్మ ఏడువారాల జాతర ప్రారంభంకానున్నది. దీనికి సంబంధించి అన్నిఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు.

జనార్దన్‌రెడ్డి సేవలు మరువలేనివి



పుట్టి జనార్దన్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

హత్నూర, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమంలో దేవులపల్లి గ్రామానికి చెందిన పుట్టి జనార్దన్‌రెడ్డి ఎంతో మందిని చైతన్యపరిచి ఉద్యమంలో భాగస్వాములను చేశారని ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు చెన్న నర్సింలు అన్నారు. జనార్ధన్‌రెడ్డి వర్ధంతి సంద ర్భంగా దౌల్తాబాద్‌లోని తెలంగాణ తల్లి చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహా నికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఉద్యమ సారథి కేసీఆర్ ఏ పిలుపు ఇచ్చినా, హత్నూర మండ లంలో ముందుండి పనిచేసి విజయవంతం చేయడంలో ఆయన కృషి వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు ఇంద్రశేఖ ర్‌రెడ్డి, మారుతి రాజు, కొన్యాల మాజీ సర్పంచ్ నర్సింలు పాల్గొన్నారు.

'శేష జీవితం ఆనందంగా గడపాలి'

వెల్దుర్తి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగంలో వారు చేసిన సేవలే వారికి గుర్తింపు ఇస్తాయని సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి అన్నారు. వెల్దుర్తి సొసైటీ సీఈవోగా విధులు నిర్వర్తించిన సిద్ధయ్య ఉద్యోగ విరమణ సంద ర్భంగా వెల్దుర్తిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కార్యక్రమం ఏర్పాటు చేశారు. సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు, సిబ్బంది సిద్ధయ్య దంపతులను సన్మానించి మాట్లాడారు. సిద్ధయ్య చేసిన సేవలు మరువలేనివన్నారు. సిద్ధయ్య శేష జీవితం కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలని వారు సూచించారు.

'పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి'

నిజాంపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు విడుదల చేసి పేస్కేల్ అమలు చేయాలని ఏపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యా లయంలో పెండింగ్ వేతనాల విడుదలపై ఎంపీడీవో రాజురెడ్డికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. మూడునెలలుగా వేతనాలు రాక నానా కుటుంబం గడవడం కష్టంగా ఉన్నదన్నారు.